


సేటి దినపత్రిక

# సూర్య

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమురం భీం
ఆసిఫాబాద్

www.suryaa.com

బుధవారం 18 మార్చి 2026 పేజీలు 05


ప్రకృతి వ్యవసాయ సాగుతో

# మరింత ఆరోగ్యం

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్**

ప్రకృతి వ్యవసాయ సాగుతో ప్రజల జీవన ప్రమాణాన్ని మరింత పెంపొందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాలలో జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అందించి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగులో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులు, సాగు పద్ధతులు అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని, తద్వారా ప్రజలకు మరింత ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, పంట సాగులో రైతులకు అవసరమైన మెలకువలను అందించి అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. 10 సంవత్సరాల పాటు ప్రకృతి వ్యవసాయ సాగు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ప్రకృతి వ్యవసాయ రైతు కొట్టే రవీందర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 రైతువేదికలలో 1 వేయి 875 మందితో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పథకం పురోగతి దిశగా జిల్లాలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, కార్పొరేటర్లు రాజన్న, బియ్యాల త్రివేణి, కమల, లగిశెట్టి రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ మొరం తవ్వకాలు చేపడితే

# కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ బ్యూరో, సూర్య మేజర్ న్యూస్ :**

అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని జాం గ్రామ చెరువు సమీపంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం మొరం తవ్వకాలు చేపట్టాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే తవ్వకాలు చేయాలని సూచించారు. అక్రమ మొరం తవ్వకాలపై రెవెన్యూ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. మొరం, ఇసుక అక్రమ తవ్వకాలు చేసే వారిపై అలాగే అక్రమంగా రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మైనింగ్ అధికారి హరి ప్రసాద్, తహసిల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

# అందించాలి

**- ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**- అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలి**
**- వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి**
**- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**
**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**






**లక్షెటిపేట్,మార్చి17,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ తో కలిసి సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వెంకట్రావుపేట, దౌడపల్లి, చందారం గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా పట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద చెత్తను రోడ్లపై, మురుగు కాలువలలో వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. లక్షట్టిపేట మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ పథకం నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవిలో ప్రజలకు నిరంతరంగా నీటిని అందించే విధంగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి మండలంలో

## జిల్లా కలెక్టర్ హరిత అకస్మిక పర్యటన

**తిర్యాణి, మార్చి17,సూర్యమేజర్ న్యూస్**

తిర్యాణి మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలని మంగళవారం నీతి అయోగ్ అధికారి అస్నాశర్మతో కలిసి ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రక్రియను పరిశీలించారు విద్యార్థులకి హెచ్. పి. ఓ వ్యాక్సిన్ అవశ్యకత గురించి అవగాహన కల్పించారు హాస్పిటల్ లోని వార్డులను పరిశీలించి రోగుల చికిత్స గురించి ఆరా తీశారు ఆసుపత్రి లో మినరల్ వాటర్ ప్లాంట్ రిపేర్ ఉండడంతో ఆసుపత్రి సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి రిపేర్ కి సంబంధించిన నిధులు మంజూరు చేస్తామని వెంటనే రిపేర్ చేపించి మినరల్ వాటర్ ప్లాంట్ ని రోగులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంపూర్ణత అభ్యాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా పశువులకు వేస్తున్న గాలికుంట్ల వ్యాధి టీకాల కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు పాడి పంట అభివృద్ధికోసం రైతులు ప్రభుత్వం చేపడుతున్న పథకాలని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి రమాదేవి. ఎంపీడీఓ వేముల మల్లేష్,ఉపసర్పంచ్ చేని కుమార్ డాక్టర్ వెంకటేష్,డాక్టర్ శ్రీవాణి, పశువైద్యాధికారి సాగర్ పలువురు రైతులు పాల్గొన్నారు



## వైద్యం, విద్యపై దృష్టిసారించాలి

**- నాటు వైద్యాన్ని మానండి, ప్రభుత్వ--ప్రైవేటు వైద్యం నమ్మండి - గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం - పాలవాగులో పోలీసుల ఉచిత వైద్య శిబిరం- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**సిరికొండ, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్**

మారుమూల ఆదివాసి గిరిజన గ్రామ ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరచాలని, వైద్య సదుపాయాలు మరింత చేరువ చేసే ఉద్దేశంతో మంగళవారం సిరికొండ మండలంలోని కుంటగూడా గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు హామ్లెట్ లో ఆదివాసీలకు ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కుంటగూడ, పాలవాగు,రాజింగూడ గ్రామాల 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం, ఆదిలాబాద్ నుండి నిష్ణాతులైన ప్రముఖ ప్రైవేటు వైద్యుల సహాయంతో నిర్వహించారు.

( మిగితా..2లో)




ప్రజల ముంగిటకే

# మెరుగైన వైద్య సేవలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో,సూర్య మేజర్ న్యూస్**



గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తలమడుగు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిత్ర ఎన్జీఓ సహకారంతో ఏర్పాటు చేసిన రూ. 2 లక్షల విలువైన నూతన వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య శిబిరాల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను అక్కడికక్కడే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే అవి భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులుగా మారే ప్రమాదం ఉందని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,గర్భం దాల్చిన నాలుగు లేదా ఐదు నెలల సమయంలో తప్పనిసరిగా 'టిఫా' స్కాన్ చేయించడం ద్వారా శిశువుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవచ్చున్నారు.

( మిగితా...2లో )

# ప్రజల ముంగిటకే

## మెరుగైన వైద్య సేవలు-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మొదటి పేజీ తరువాయి...**

దీనివల్ల ప్రసవ సమయంలో తలెత్తే ఇబ్బందులను అరికట్టి తల్లీబిడ్డల



ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ మరియు టీబీ బాధితులకు క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేయాలని, తద్వారా కిడ్నీ, లివర్ వైఫల్యాల వంటి తీవ్ర సమస్యలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం 12 గంటలు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ సేవలను భవిష్యత్తులో 24 గంటలకు విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నామని, ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించడం ద్వారా ఆసుపత్రికి అదనపు నిధులు, వసతులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రామచంద్ర రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజ్ మోహన్, డాక్టర్ హరీష్, శ్రీధర్,ఆరోగ్య శాఖ సిబ్బంది,గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం -- తాగునీటి సమస్యలపై

# మున్సిపాలిటీ చర్యలు

**మందమర్రి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాల సందర్భంగా మంగళవారం మందమర్రి పట్టణంలో పారిశుధ్య, తాగునీటి సమస్యల పరిష్కారంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ కార్యాలయ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి రామన్ కాలనీ వద్ద ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ పరిసర ప్రాంతాలలో విస్తృత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. బ్రిడ్జ్ పక్కన పేరుకుపోయిన దుబ్బ, దూళి, చెత్త చెదారాన్ని కుప్పలుగా చేర్చి తొలగించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణ, ఇంచార్జి జవాన్ మేకల నరేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని కమిషనర్ తెలిపారు. అలాగే మరోవైపు భాగ్యనగర్ కాలనీ, శ్రీపతి నగర్, స్టేషన్ రోడ్డు, ఊరు రామకృష్ణపూర్, ఆర్.కె.--1, సుభాష్ నగర్ ప్రాంతాలలో గత 15 రోజులుగా మంచినీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయంపై అధికారులు స్పందించారు. మిషన్ భాగీరథ పైపులైన్లు కొన్ని ప్రాంతాలలో జామ్ కావడం సమస్యకు ప్రధాన కారణమని గుర్తించారు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుమతి పర్యవేక్షణలో వర్కర్లు పైపులైన్లు తవ్వించి మరమ్మత్తు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని వారు తెలిపారు. ఈ చర్యలతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సంక్షేమం అభివృద్ధి కోసమే

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-జయలలిత

**లోకేశ్వరం మండల్ సూర్య మేజర్ న్యూస్** ప్రజా సంక్షేమం,గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నిర్వహిస్తుందని సర్పంచ్ దడిగే జయలలిత భోజన్న అన్నారు. లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామంలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం,తాగునీరు, వీధి దీపాలు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు,తదితరాల గురించి చర్చించారు.ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని,ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. అనంతరం మండుతున్న ఎండల దృష్ట్యా చలివేంద్రాన్ని ప్రారంభించి, గ్రామపంచాయతీమల్టీపర్పస్ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయినాథ్,పంచాయతీ కార్యదర్శి రాజు,అంగన్వాడి టీచర్లు,ఐకెపిఈవో అధ్యక్షురాలు, గ్రామస్తులు,పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లాలో గ్యాస్ సిలిండర్‌ల కొరత లేదు.

## - కలెక్టర్ అభిలాష అభినవ్.

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. అన్ని గ్యాస్ ఏజెన్సీలలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నవారికి నిర్ణీత సమయంలోపల సిలిండర్లను ప్రజలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎవరికైనా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 91005 77132 ను సంప్రదించవచ్చునని వివరించారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి, ప్రజలకు సరిపడినన్ని సిలిండర్లను సాఫీగా పంపిణీ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు గ్యాస్ కొరత అని వస్తున్న అసత్య వార్తలను, పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



## గ్రామాలలో వీధిలైట్లు పగటిపూట వెలుగ కుండా

# నియంత్రించాలి..కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్ బ్యూరో,మార్చి17,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో, మున్సిపాలిటీలలో పగటిపూట విద్యుద్దీపాలు వెలుగకుండా నియంత్రించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట పాడి బండ గ్రామ పంచాయతీలను కలెక్టర్ సందర్శించి, పగటిపూట వీధి దీపాలు వెలుగుతుండడాన్ని గమనించి స్థానిక పంచాయతి కార్యదర్శిని పిలిచి వీది దీపాలు వెలుగుతుండడానికి గల కారణాలను అడిగి తెలుసుకొని వెంటనే



విద్యుత్ తీగలు మరమ్మత్తులు చేపట్టి నియంత్రణ బోర్డులు బిగించాలన్నారు. జిల్లా పంచాయతి అధికారి బిక్షపతి గౌడ్ కు ఫోన్ ద్వారా జిల్లాలోని గ్రామపంచాయతీలలో, మున్సిపాలిటీలలో, పగటిపూట విద్యుత్ దీపాలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని,ఈ సమాచారాన్ని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు వాట్సప్ ద్వారా సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతి పరిదిలోని పారిశుద్యం పై శ్రద్ద వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియా డోర్లి ఓసి-2 గనిని

# సందర్శించిన అధికారులు

## - మూతపడిన డోర్లి ఓసి-2 గని పర్యావరణ చర్యలపై

## అధికారుల పరిశీలన.

**బెల్లంపల్లి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి ఏరియాలో మూత పడిన డోర్లీ ఓసి-2 గనిని రాజేంద్ర చోలే (ఓ ఎస్ డి, కోల్ కంట్రోల్ ఆఫీస్ నాగ్ పూర్), ఏ కృష్ణ మోహన్ రావ్ (ఓ ఎస్ డి, కోల్ కంట్రోల్ ఆఫీస్ కొత్తగూడెం) లు మంగళ వారం రోజున సందర్శించారు. మూత పడ్డ గని మరియు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులు పరిశీలించారు. నాటిన మొక్కలను, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను తెలుసుకున్నారు. రక్షణ కంచె లను చూశారు. అంతకుముందు జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎం. విజయ భాస్కర రెడ్డి బెల్లంపల్లి ఏరియా వివరాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గోలేటి ఓసి ప్రాజెక్ట్ అధికారి నాయిని ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, కార్పోరేట్ అదనపు మేనేజర్ వి. తిరుపతి, డోర్లి ఓసి-2 మేనేజర్ పి. మహేష్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్యం, విద్యపై దృష్టిసారించాలి

- నాటు వైద్యాన్ని మానండి, ప్రభుత్వ--ప్రైవేటు వైద్యం నమ్మండి
- గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం
- పాలవాగులో పోలీసుల ఉచిత వైద్య శిబిరం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు విద్యకు మొదటి ప్రాధాన్యత కేటాయించాలని, నాటు వైద్యాన్ని నమ్మకుండా ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచించారు. రక్తహీనతకై ఇప్పపువ్వు లడ్డూలను తినాలని సూచించారు. అభివృద్ధిని కోరుకునేవారు సంఘవిద్రోహశక్తులకు దూరంగా ఉండాలని అలాంటి వారి సమాచారం వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకై జిల్లా పోలీసులు చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని,




గంజాయి పండించడం, రవాణా చేయడం, సేవించడం, చట్టరీత్య నేరమని, గంజాయి అలవాటు పడిన వారికి డి అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్సను అందజేయడం జరుగుతుందని తెలిపారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వ పథకాలు రాకుండా ఉంటాయని తెలిపారు. యువత గ్రామాలను వదిలి ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలను సాధించి గ్రామాల పేరును, కీర్తి ప్రతిష్టలను పెంచేలా కష్టపడి చదవాలని సూచించారు. గ్రామంలో చదువుతున్నటువంటి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. వైద్య శిబిరం నందు చికిత్సను అందుకున్న బాధితులు ఎలాంటి అదనపు చికిత్స కై ఆదిలాబాద్ నందు ఉన్నత వైద్యానికి సిఫార్సు చేసినట్లయితే వారికి సరైన సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంచి ఆహారా అలవాట్లను అలవర్చుకోవాలని అన్నం తినడం తక్కువ చేసి, జొన్న పిండి రొట్టె లాంటి వాటిని తినడం అలవర్చుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా ఉండాలని ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు చేస్తున్న జిల్లా పోలీసుల కృషికి సహకరించాలని తెలిపారు. మొదటగా ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మరియు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే లను గ్రామ ప్రజలు ఆదివాసి సాంప్రదాయాల డప్పు వైద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. తదుపరి కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ఆదివాసీలు తమ సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ఆదివాసి ప్రజలు చదువుపై ప్రాధాన్యత కేటాయించాలని, ప్రజలు ఎలాంటి వైద్య సేవలకైనా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించాలి అన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించి గ్రామాల, ప్రజల అధివృద్ధికి సహాయ పడాలని తెలిపారు. ఆదివాసిలు అన్ని రకాలుగా అభివృద్ధి చెంది, ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడా సిఐ సిహెచ్ రమేష్, సిరికొండ ఎస్సై పూజ, ఏఎస్సై రమేష్ ,డాక్టర్లు డా ఆడే క్రాంతి కుమార్, జనరల్ ఫిజిషియన్, రజిత క్రాంతి కుమార్, గైనకాలజిస్ట్, డా ఆనంద్,డెంటల్, డా శృమిత్ జవ్వాజి, ఆర్థోపెడిక్, డా వివేక్, గ్యాస్ట్రిక్,డా మహేష్, ఆప్తమలజిస్ట్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు వైద్య బృంద సభ్యుడు శాంత రాజ్, గ్రామ సర్పంచ్ కుమరం మీరాబాయి, యాదవ్ రావు, జిల్లా సార్మేడి,తొడసం అమృత్ రావ్, గ్రామ పెద్దలు యూత్ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం -- రైతులకు మినీ కిట్స్ పంపిణీ

**చింతలమానేపల్లి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బాలాజీ అంకోడ రైతు వేదికలో "నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్" కార్యక్రమంను మంగళవారం ఏవో కార్తిషా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మినీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కార్తిషా మాట్లాడుతూ రైతులు రసాయనాలపై ఆధారపడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల నాణ్యత పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వెంకటేష్, శ్రీలత, జ్ఞానేశ్వర్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



# పనులను వేగవంతం చేయాలి .. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,మార్చి 17, సూర్య మేజర్ న్యూస్ :** అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమృత పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్ లైన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

**ఖానాపూర్,మార్చి17, సూర్య మేజర్ న్యూస్ :**

రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని రాజుర సర్పంచ్ మల్లేష్ యాదవ్ సూచించారు. ఈ అంటువ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గి పశువుల ఆరోగ్యం దెబ్బతింటుందని



అన్నారు . పశువులను రక్షణ కొరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించడం అవసరమని రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పశువులన్నింటికీ టీకా కార్యక్రమం పూర్తి చేయాలని అధికారులను కోరారు.ఇందులో ఉప సర్పంచ్ సంజీవ్, భీమన్న, తదితరులు ఉన్నారు.

## గండి రామన్న గుట్టపై
## కాకతీయుల కాలం నాటి ప్రాచీన వీరగల్లు విగ్రహం

**నిర్మల్ ప్రతినిధి మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.**

వేల సంవత్సరాలుగా ఆధ్యాత్మిక శోభతో వెలుగొందుతున్న నిర్మల్ జిల్లా కేంద్రంలోని గండిరామన్న గుట్టపై సుమారు 11-13 వ శతాబ్దపు కాకతీయుల కాలంనాటి వీరగల్లు ను గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావ్ తెలిపారు. కాకతీయులు జైనం నుండి శైవం లోకి మారిన తర్వాత అనేక శివాలయాలు నిర్మించారు. గండి రామన్న గుట్ట పెద్ద పెద్ద రాళ్లు, గుహలతో కూడుకుని ఉంటుంది. సముద్ర మట్టానికి సుమారు 300 ఫీట్ల ఎత్తులో లోతైన గుహలో శివలింగం, నంది,సర్పవిగ్రహాలు, ఉమామహేశ్వరుల విగ్రహాలు ఉన్నాయి. వీటిని పరిశీలిస్తే క్రింది నుండి విగ్రహాలు పైకి తీసుకురావడం సాధ్యం కాదు కనుక గుహలోనే చెక్కిఉంటారు.. ఈ విగ్రహాలను బట్టి చూస్తే ఇక్కడ శైవ సంబంధం కలిగిన ఆశ్రమం ఉండే అవకాశం ఉంది. లేదా ఎవరైనా ఆధ్యాత్మిక సాధకులు మధ్యయుగంలో వీటిని ఏర్పాటు చేసుకుని ఉండొచ్చు అని చెప్పవచ్చు. సాధారణంగా యుద్ధంలో మరణించిన వీరుని స్మారకంగానో లేదా గ్రామ రక్షణకోసం పోరాడిన వీరుని గుర్తుగా వీరగల్లు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటారు. గండి రామన్న ప్రాంతం 50 ఏళ్ల క్రితంవరకు దట్టమైన అటవీప్రాంతం... పులులు, సింహాలు వంటి జంతువులు సంచరించేవి... ఈ ప్రాంతంలో వీరగల్లు ఉండటంతో ఇక్కడ యుద్ధం జరిగి ఉండొచ్చు లేదా రహస్యంగా సైనికులు ఈ గుహల్లో తలదాచుకొని ఉండవచ్చు...వీరగల్లులో వీరుని చేతిలో ఖడ్గం, డాలు ఉన్నాయి. తలపై అర్థవృత్తాకారపు గూడారం (ఆర్చ్) చెక్కబడి ఉంది.వందల సంవత్సరాల నుండి గాలి, వర్షాలకు వీరగల్లు ఆకృతి చెక్కు చెదిరిపోయింది. క్షేత్ర పర్యటనలో డాక్టర్ తుమ్మల దేవరావ్ తో పాటు అబ్బడి రాజేశ్వర్ రెడ్డి భీమేష్ లు పాల్గొన్నారు



## కారోబారి సంఘం మండల అధ్యక్షుడు
## చిట్యాల సంజీవ్ ముందస్తు అరెస్ట్

**సిర్పూర్ యూ మార్చ్ 17 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ యు మండలం నుంచి వివిధ గ్రామపంచాయతీల పరిశుద్ధ కార్మికులు, మల్టీ పర్పస్ వర్కర్ల సిఐటీయూ పిలుపు మేరకు చలో హైదరాబాద్




కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా కారోబారి సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల సంజీవ్ సహా పలువురు నాయకులను ముందస్తు అరెస్ట్ అదుపు లో తీసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. హైదరాబాద్ లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల భాగంగా ఉన్నతాధికార ఆదేశాల మేరకు ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

## జాతీయ సహజ వ్యవసాయ మిషన్
## కిట్ల పంపిణీ

**మందమర్రి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.**

మండలంలోని సండ్రోన్ పల్లి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆదిల్ పేట గ్రామానికి చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహజ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై ఇచ్చిన సందేశాన్ని రైతులు దృశ్య--శ్రవణ మాధ్యమం ద్వారా వీక్షించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి జి. కిరణమై, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, ఆదిల్ పేట గ్రామ సర్పంచ్ నెండుగూరి పున్నం లు రైతులకు సహజ వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఈ కిట్లను సమర్థంగా వినియోగించి సేంద్రియ విధానాల్లో వివిధ కషాయాలు తయారు చేసి పంటలపై ఉపయోగించాలని సూచించారు. సహజ వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిల్ పేట గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి

**సారంగాపూర్,మార్చ్ 18, సూర్య మేజర్ న్యూస్**

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కాల్వ నరేష్ డిమాండ్ చేశారు.సోమవారం రోజు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ రవీందర్ కు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు అందిస్తానన్న రైతు భరోసా,వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం,ఆరు గ్యారెంటీ ల పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిన్నయ్య,ఎల్లన్న,గణేష్,శ్రీకాంత్ రెడ్డి,కృష్ణారెడ్డి,శ్రీకాంత్,ప్రశాంత్,రాజేందర్ రెడ్డి,సాగర్ రెడ్డి,చెన్న రాజేశ్వర్,నర్సయ్య,భూమారెడ్డి,తిరుమల చారి,మల్లేష్,ఉట్ల రాజు,ప్రకాష్,మహేందర్,శేఖర్ గౌడ్, చంద్రశేఖర్,శ్రీనివాస్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే గ్రామభివృద్ధి

**నార్నూర్, మార్చి 17 సూర్య మేజర్:** ప్రజలందరి సహకారాంతోనే గ్రామభివృద్ధి సాధించగలమని స్థానిక సర్పంచ్ బాణోత్ కావేరి అన్నారు. మంగళవరం గ్రామపంచాయతీ



కార్యాలయంలో సర్పంచ్ కావేరి అధ్యక్షతన సాధారణ గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈసందర్బంగా ప్రభుత్వం ద్వారా గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు విడుదలైన నిధుల వివరాలు తెలియజేశారు. అనంతరం పంచాయతీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ ల వివరాలు తెలుపుతు ప్రతివీధిలో షెడ్ లైట్లు, వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు చెసమన్నారు. అలగే అక్కడక్కడమిగిలిన వాటికీ త్వరలోనే పుర్తిచేస్తమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలపగా సమయానసారం ప్రతి సమస్యను పరిష్కరిస్తానని సూచించారు. వ్యక్తిగత విషయాలను దూరం పెట్టి గ్రామభివృద్ధి కొరకు సలహాలు సూచనలు చేయాలనీ కోరారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో నార్నూర్ ను జిల్లాలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్, ఉప సర్పంచ్ మహమ్మద్ ఖురేషి, వార్డ్ మెంబర్లు, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి మొతిరం మరియు గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాష్ట్ర సాధనలో నష్టపోయిన ఉద్యమకారులకు అండగా ప్రభుత్వం నిలవాలి
### - త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వాలి
### - గుంజాల భాస్కర్ రెడ్డి

**సిరికొండ మార్చి 17, సూర్య మేజర్ న్యూస్**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జైలు పాలై, జీవనాధారాలు కోల్పోయిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుంజాల భాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం



కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా సిరికొండ మండల లోని మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తమపై కేసులు, జైలు శిక్షలు, ఆర్థిక నష్టాల వల్ల కుటుంబాలు కష్టాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఉద్యమకారునికి 250 గజాల గృహ స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించుకునే ఏర్పాట్లు చేయాలని, నెలకు రూ.25 వేల పింఛను, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంకా అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల అశోక్, షేక్ రంజాన్, రాజేశ్వర్ చారి, బషీర్ పాల్గొన్నారు.

### తహసిల్దార్ కార్యాలయంలో
## ముస్లింలకు రంజాన్ తోఫా

**నస్పూర్, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్:** నస్పూర్ తహసిల్దార్ కార్యాలయంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు తోఫా ను మంగళవారం మంచిర్యాల నగర మేయర్ ధర్ని మధుకర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, నస్పూర్ తహసిల్దార్ సంతోష్ కుమార్, డిప్యూటీ తాసిల్దారు హరిత, కార్పొరేటర్లు హరికృష్ణ, గోపాల్ రావు, ఖలీద్, అగ్గు సాగర్, కొండ్ర రాజేశ్వర్, తోట రజిత శ్రీనివాస్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి మండల



పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ కార్పొరేషన్ ఏ.ఈ. లతో పారిశుధ్యం, పన్నుల వసూలు, ఇందిరమ్మ ఇండ్లు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, ఉపాధి హామీ కూలీల మొబిలైజేషన్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు రోజువారీగా పర్యవేక్షించాలని, ప్రతి గ్రామపంచాయతీలో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగు కాలువలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణతో 100 శాతం పారిశుధ్యం నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో నర్సరీలు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని గ్రామాలలో మంజూరు కాబడిన ఇందిరమ్మ ఇండ్లను గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్మికులను ఎక్కువగా మొబిలైజ్ చేయాలని, ప్రతి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటించాలని తెలిపారు. ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకేజీ ఉన్నట్లయితే వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని, గ్రామాలలో సందర్శించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ నెల 23వ తేదీ నుంచి ఒక ప్రత్యేక అధికారి, తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామ పంచాయతీల నిర్వహణ సరిగ్గా లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ పర్యవేక్షణ

**బెల్లంపల్లి, మార్చ్ 17, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య మంగళవారం సందర్శించి ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలును సమీక్షించారు. గ్రామంలోని నర్సరీ, పారిశుధ్య పనులను పరిశీలిస్తూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు వేరు సేకరించి డంపింగ్ యార్డ్‌కు



తరలించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని సూచించారు. గ్రామ మార్కెట్ ప్రాంత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచిస్తూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. అలాగే గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించి, ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలి

**నస్పూర్, మార్చ్ 17, సూర్య మేజర్ న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని శ్రీరాంపూర్ బిజెపి జోనల్ అధ్యక్షులు సత్రం రమేష్, నస్పూర్ జోనల్ అధ్యక్షులు కుర్రె చక్రవర్తి ఆధ్వర్యంలో నస్పూర్ ఎమ్మార్వో ఆఫీసు ఎదుట



ధర్నా కార్యక్రమం చేపట్టినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన అందరికీ, ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, గత 35 సంవత్సరాల నుండి సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న వారికీ వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు, రెండు గుంటల భూమితో పాటు, శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల్లో, ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎలక్షన్ లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ రావు, శ్రీరాంపూర్ జోన్ ఉపాధ్యక్షుడు కటుకూరి సతీష్ కుమార్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

**లక్షెట్టిపేట, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం,



కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అధ్యాపకులు విద్యార్థులు అందరూ సంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరై కొత్తదనం చూపారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్,అధ్యక్షత వహించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ఉగాది తెలుగు వారి నూతన సంవత్సరం అని తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలు ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు. వ్యవసాయం పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని ఈ నూతన పరాభవ నామ సంవత్సరం కొత్త విజయాలను తీసుకు రావాలని ఆకాంక్షించారు. యువతరం తెలుగు వారి సాంప్రదాయ ఆచారాలు కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమశీలో ధర్మపురికి చెందిన ప్రముఖ వేద పండితులు గుడ్ల సురేష్ పంచాంగ శ్రవణశీ చేసి అందరికీ ఈ సంవత్సరం రాశి ఫలాలు తెలిపారు. పంచాంగ శ్రవణం విన్నవారికి కష్టాల నుండి ఉపశమనం కలుగు తుందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల కవి సమ్మేళనం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకటటుకున్నాయి. ఉత్తమ కవిత్వం రాసిన విజయ్, సాగర్, అక్షిత విద్యార్థులను ప్రిన్సిపాల్ డా మహాత్మా సంతోష్ గారి చేతుల మీదుగా సన్మానించారు. ఉగాది పచ్చడి ఉగాది ప్రసాదం వితరణ చేయడం జరిగింది.కార్యక్రమశీలో వైస్ ప్రిన్సిపల్ డా. సంతోష్ కుమార్ తెలుగు విభాగం అధ్యక్షులు కార్యక్రమం కో ఆర్డినేటర్, డా. తన్నీరు సురేష్ కార్యక్రమం అధ్యాపకులు, శంకరయ్య, ప్రేమలత , నాగేశ్వర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, కవిత, సంధ్యారాణి, రాజ్ కుమార్, మల్లయ్య, స్వామి కాంతయ్య, ప్రసన్న , నివేదిత, రాజేశం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

**నస్పూర్, మార్చ్ 17, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో ప్రతీ నెల నిర్వహించే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం 18 న బుధవారం డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయం నందు ఆయుర్వేద వైద్య పరీక్షలు చేయడం జరుగుతుంది. బిపి షుగర్ వంటి వ్యాధులు కీళ్ల నొప్పులు నడుము నొప్పులు, వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుంది అని సింగరేణి యజమాన్యం ఒక ప్రకటనలో తెలిపినారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్విని సద్వినియోగం చేసుకోగలరు.

## చేతిపంపుకు మరమ్మత్తులు -వీధిదీపాలను ఏర్పాటు



**పెంచికల్ పేట్, మార్చి 17 ,సూర్య మేజర్ న్యూస్ :**

మండలంలోని చెడ్వాయి గ్రామపంచాయతీలో గుట్టలవాడలో చేతిపంపు చెడిపోవడంతో సర్పంచ్ శ్రీనివాస్ చేతి పంపు కు మరమ్మతులను చేయించారు. తాగునీటి కష్టాలు లేకుండా గ్రామస్తులు నీటి సమస్యను తెలియజేసినట్లైతే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. గ్రామంలో వీధిదీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జోగయ్య పాల్గొన్నారు..

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

**మందమర్రి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఓ టు జీఎం కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్,బ్రాంచ్ అధ్యక్షుడు జెట్టి మల్లయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస పనికి కనీస వేతనం అమలు చేయాలని,లేకపోతే హై పవర్ కమిటీ నిర్ణయించిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం అందించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో పని చేస్తున్న వాల్వో డ్రైవర్లకు హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని తెలిపారు. ఫిబ్రవరి 12న జరిగిన సమ్మెలో పాల్గొన్న కార్మికులపై యాజమాన్యం విధించిన పెనాల్టీలను వెంటనే రద్దు చేసి "నో వర్క్ -- నో వేజెస్" విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేకే ఓసీలో గత ఆర్వీఆర్ కాంట్రాక్టర్ కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా మరియు కాంట్రాక్టు ముగింపు సెటిల్మెంట్ బకాయిలను ఇప్పటికీ పూర్తిగా చెల్లించలేదని ఆరోపించారు. ఈ బకాయిలను యాజమాన్యం జోక్యంతో వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్ యాదవ్,సంపత్,సురేందర్,తోట తిరుపతి,గట్టు స్వామి, చుక్కల శంకర్,గుగ్గుల సంతోష్, గట్టయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలో ఏఎల్ఎంఎస్సి కమిటీ ఏర్పాటు

**పెంచికల్ పేట్, మార్చి 17,సూర్య మేజర్ న్యూస్ :**

మండలంలోని దరోగపల్లి గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలో ఏఎల్ఎంఎస్సి కమిటీని సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి హరీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడిల ద్వారా వచ్చే పౌష్టికాహారాన్ని అందరికీ అందేలా చూడాలని, ప్రభుత్వం అందించే న్యూట్రిషన్ కిట్లను ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అంగన్వాడి టీచర్ పాల్గొన్నారు.



# స్పష్టమైన ఓటరు జాబితా తయారీకి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,మార్చి 17, సూర్య మేజర్ న్యూస్ :** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు దేశ్ పాండే లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం త్వరలో ప్రారంభం కాబోతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా 2002 ఓటర్ జాబితాకు 2025 ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేసి ఎలాంటి పొరపాట్లు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా మరణించిన, షిఫ్ట్ అయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడంలో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం ద్వారా సహకరించాలని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లుగా నియమించబడిన వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డబల్ ఓటు ఎవరికైనా ఉన్నట్లయితే వారు స్వచ్ఛందంగా తమ ఒక ఓటును తొలగించుకోవాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## అపరిశుభ్ర హోటళ్ల పై మున్సిపల్ కమిషనర్ కఠిన చర్యలు

**బెల్లంపల్లి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్:** బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని కాల్ టెక్స్ ఏరియా, బజార్ ప్రాంతాల్లో ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల పై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అరేబియన్ క్లాసిక్ నైట్స్ మండి,



అబ్దుల్ రెహమాన్ మండి హౌస్, వినాయక టిఫిన్ అండ్ బిర్యాని హోటళ్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం గుర్తించి మొత్తం రూ.20,000 జరిమానా విధించారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహారం తయారు చేయడం పట్ల యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేస్తూ, వెంటనే పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. ఇకపై ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే దుకాణాలను స్వాధీనం చేసుకుని మున్సిపల్ చట్టం--2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి హెచ్చరించారు.

## బెల్లంపల్లి ఏసిపితో సింగరేణి జీఎం మర్యాదపూర్వక భేటీ

**మందమర్రి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.** మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మంగళవారం బెల్లంపల్లి నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీకి జీఎం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భేటీ సందర్భంగా సింగరేణి సంస్థ కార్యకలాపాలు, మందమర్రి ఏరియాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో ఉన్న సమన్వయం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. సంస్థ భద్రత, స్థానిక సమస్యల పరిష్కారంలో పోలీసు యంత్రాంగం అందిస్తున్న సహకారానికి జీఎం రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ ద్వారా సింగరేణి సంస్థ, పోలీసు విభాగం మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## బెల్టు షాపులపై దాడులు..



**పెంచికల్ పేట్,సూర్య మేజర్ న్యూస్ :** పెంచికల్ పేట మండలములో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారము మేరకు దాడులు నిర్వహించి (5.04) లీటర్ల మధ్యమును స్వాదీనపరుచుకొని బొంబాయి గూడ కి చెందిన నాగపురి శ్రీనివాస్, పగిడి రంగనాథ్ మరియు ఎల్లూర్ కి చెందిన గణపురం సత్యనారాయణలపై కేసు నమోదు చేసినట్టు కాగజనగర్ ఎక్సైజ్ సిఐ వి .రవి తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నట్టు తేలిపారు.

## జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు. తప్పవు

**- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్.** జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా తెలియజేసారు.పారిశ్రామిక అవసరాలనిమిత్తం కేటాయించిన ప్రభుత్వ భూములపై కొందరు వ్యక్తులు అక్రమంగా కన్నేసి నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు.నిబంధనలకు విరుద్ధంగా పొందిన పట్టాలను తక్షణమే రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుని పారిశ్రామిక శాఖకు అప్పగించినట్లు తెలిపారు.ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి అని, దానిని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆక్రమణదారులపై ఖచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

## సింగరేణి గనుల వద్ద ఏఐటీయూసీ ఆందోళనలు

**- కార్మిక హక్కుల, సమస్యలపై గళమెత్తిన యూనియన్**

**బెల్లంపల్లి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్:** సింగరేణి పరిధిలోని బెల్లంపల్లి శాంతిగని మైన్, కాసిపేట-1, కాసిపేట-2 గనుల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాలు నిర్వహించారు. శాంతి గని మైన్ వద్ద మంతెన రమేష్ అధ్యక్షతన నిర్వహించిన 'సేవ్ సింగరేణి'



ధర్నాలో ముఖ్య అతిథిగా చిప్ప నర్సయ్యా పాల్గొని మాట్లాడుతూ బకాయిల విడుదల, మెడికల్ సౌకర్యాలు, హెచ్ఆర్ఏ, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలపై డిమాండ్ చేశారు.కాసిపేట-1 గనిలో బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి గని మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు. కాసిపేట-2 గనిలో కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఒప్పందాల అమలు, ఉత్పత్తి పెంపు, సంక్షేమం, నియామకాలపై చర్యలు కోరారు. మార్చి 18 నుంచి "సేవ్ సింగరేణి" ప్రచార జాత శ్రీరాంపూర్ నుంచి ప్రారంభమవుతుందని, ఈ జాతను కోనమనేని సాంబశివరావు, వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితర నాయకులు ప్రారంభించనున్నారని తెలిపారు. జాత ద్వారా కార్మికులను చైతన్యం చేస్తూ అన్ని ఏరియాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ఈనెల 30న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి ధర్నా కార్యక్రమం జరుగనున్నందున కార్మికులందరూ భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయం రైతుల భవిష్యత్తు

**- వ్యవసాయ శాఖ అధికారి శ్రద్ధ**

**- సిరికొండలో ఫార్మర్ కిట్స్ పంపిణీ కార్యక్రమం**

**సిరికొండ, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్** ప్రకృతి వ్యవసాయం చేస్తేనే రైతులకు భవిష్యత్తు ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రద్ధ అన్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా సిరికొండ రైతుల వేదిక ఆధ్వర్యంలో రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం భవిష్యత్ తరాలకు భూమి సారాన్ని కాపాడే మార్గమని, ఈ పద్ధతి ద్వారా పంటలపై వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, రైతులు అందరికీ ఉపయోగపడే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఫార్మర్ కిట్స్‌లోని పరికరాలను సద్వినియోగం చేసుకుంటే, సహజ విధానాలు అమలులో మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. సహజ వనరులను కాపాడుకుంటూ, రసాయన వినియోగాన్ని తగ్గిస్తూ సాగు చేస్తేనే ఆరోగ్యకరమైన వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కిట్‌లో క్లాత్ బ్యాగ్, ఫీల్డ్ గైడ్, గుర్తింపు కార్డు, క్యాలెండర్, టోపీ, పన్ను, చిన్న ప్యాకెట్ డైరీ తదితర వ్యవసాయ అవసరాల కోసం రూపొందించిన వస్తువులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు దీపక్, ప్రవీణ్, పొచ్చంపల్లి, లక్ష్మీంపూర్ కే రైతులు, మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ కుమార్, రైతు తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకి అద్దం పట్టేలా

## తిర్యాణి మండల కాంగ్రెస్ ముఖచిత్రం

**తిర్యాణి,మార్చి17, సూర్య మేజర్ న్యూస్ :** ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని రోజుల నుండి



వర్గ పోరు తారస్థాయికి చేరడంతో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ సీటు కాస్త బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. తిర్యాణి మండలంలో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజారిటీ ఉన్న మండలం అంతకుముందు మాజీ ఎమ్మెల్యే రెండుసార్లు గెలిచిన ఆత్రం సక్కు ఇదే మండలం కావడంతో ఇక్కడ ముందు నుండి కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉంది దీనికి తోడు జువాజి అనిల్ గౌడ్ పార్టీకి కాంగ్రెస్ కార్యకర్తలకి చేసిన సేవ అంతా ఇంతా కాదు కానీ ఇటీవలే మున్సిపల్ ఎలక్షన్‌లో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల చైర్మెన్ సీటు పార్టీ నుండి చేజారడంతో అనిల్ గౌడ్ పై సస్పెన్షన్ వేటువేసింది పార్టీ అధిష్టానం.ఇప్పుడు తిర్యాని మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు భవిష్యత్తు మండల అధ్యక్షుడు ఎవరు అనేది ముందు ముందు రోజుల్లో ముందు ఉండి పార్టీని నడిపించే నాయకుడి పైనే అందరి ఆశలు.ఇక్కడ మండల అధ్యక్షుడి ఎన్నిక రేసులో ఎవరికి పదవి దక్కుతుందో అని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకి సీనియర్ నాయకుడుగా ఉన్న ఆత్రం సక్కు మాజీ ఎమ్మెల్యే తిర్యానీ మండల కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు పెద్ద దిక్కుగా కనిపిస్తున్నాడు. మరి అతడి మాటను గౌరవించి మండల అధ్యక్ష పదవి తను చెప్పిన వారికి ఇచ్చి అదిస్టానం గౌరవిస్తుందా ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో మెదులుతున్న ప్రశ్నలు ఇవన్నీటికి తెరదించాలంటే ఇంకొన్ని రోజులు ఎదురు చూడాల్సిందేనా!

## కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి

**మందమర్రి, మార్చి 17, సూర్య మేజర్ న్యూస్.** కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సారంగపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు బుర్ర శ్రావణ్ తెలిపిన వివరాల ప్రకారం రోజు లాగే గేదె మేత కోసం వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిందని తెలిపారు. స్వయం ఉపాధి కోసం గేదెలను పోషిస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నానని, ఈ తరుణంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్ఫార్మర్ కు గేదె తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పాడి గేదె విలువ లక్ష రూపాయల పై చిలుకు ఉంటుందని రైతు తెలిపాడు. పాడి పశువులను పోషిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని గేదె మృతి చెందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ప్రభుత్వం పరిహారం అందించి తమను ఆదుకోవాలని ఆయన విన్నవించుకున్నాడు.

